RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)


సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 346 పేజీలు - 04 వెల - 05/- బుధవారం 28 ఆగష్టు 2024



# దేవాలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరవాలి...



- అపచారాలకు చోటు ఉండకూడదు.!
- -బలవంతపు మత మార్పిడులు ఆగాలి....?
- అన్యమతస్థులు రాకూడదు.
- -భక్తుల మనోభావాలకు, ఆగమశాస్త్ర నిబంధనలకు అత్యంత ప్రాధాన్యం.
- -టెంపుల్ టూరిజం ప్రమోషన్ కోసం మూడు శాఖల మంత్రులతో కమిటీ.
- -దేవాలయాల ట్రస్ట్ బోర్డులలో అదనంగా మరో ఇద్దరికి అవకాశం.
- -అర్చకుల వేతనం పెంపు..

## -దేవాదాయ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

అమరావతి,ఆగష్టు 27 ఆంధ్రప్రగతి: ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాలకు మళ్లీ పునర్వైభవం రానుంది. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి, నిరాధరణకు గురైన ఆలయాలు ఇప్పుడు మళ్లీ పునరుజ్జీవం పోసుకోనున్నాయి. సీఎం చంద్రబాబు పాలనలో ఆలయాలకు మహర్దశ పట్టనుంది. అవును, తాజాగా దేవాదాయ శాఖపై చేపట్టిన సమీక్షలో సీఎం చంద్రబాబు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేవాలయల సంరక్షణ, అభివృద్ధిపై అవసరమైన చర్యలకు పూనుకున్నారు. మంగళవారం నాడు దేవాదాయ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సంబంధిత శాఖ మంత్రి, అధికారులు ఈ సమీక్షకు హాజరవగా.. సీఎం కీలక సూచనలు చేశారు. దేవాలయాల్లో ఆధ్యాత్మిక వెల్లివిరియాలి.. అపచారాలకు చోటు ఉండకూడదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులు, అన్యమనస్థులు రాకూడదన్నారు. భక్తుల మనోభావాలకు, ఆగమశాస్త్ర నిబంధనలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. రిలీజియస్ టూరిజం ప్రమోషన్ కోసం ఎండో, ఫారెస్ట్, టూరిజం మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. అలాగే.. దేవాలయాల ట్రస్ట్ బోర్డులో అదనంగా మరో ఇద్దరికి అవకాశం కల్పించాలన్నారు.

మిగతాది 2లో...

# ఏలూరులో వైసీపీకి భారీ షాక్...

**టీడీపీలో చేరిన ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ దంపతులు.**

**-కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి నారా లోకేష్.**



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 27: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేందుకు పలువురు వైసీపీ నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. ఏలూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ(చంటి) నేతృత్వంలో ఏలూరు కార్పోరేషన్ మేయర్ షేక్ నూర్జహాన్, ఆమె భర్త ఎస్.ఎమ్.ఆర్ పెదబాబు టీడీపీలో చేరారు. వీరితో పాటు ఈయూడీఏ మాజీ ఛైర్మన్, ప్రస్తుత వైకాపా పట్టణ అధ్యక్షులు బి.శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మంచం మైబాబుతో పాటు పలువురు వైసీపీ నేతలు విద్య,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో వీరిందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటమి నుంచి వైకాపా గుణపాఠం నేర్చుకోలేదని, ప్రజా ప్రభుత్వంపై నిత్యం దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని చెప్పారు.



2లో

**ఏపీని బెస్ట్ ఎనర్జీ ఎఫిషియంట్ స్టేట్ గా మార్చుతాం.!**

**-ఏపీ సీఎం చంద్రబాబు.**

# సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదు.!

- సీఎం చంద్రబాబుకు జగన్ బహిరంగ లేఖ
- ప్రజారోగ్యానికి కూటమి సర్కారు ఉరి బిగిస్తోందన్న జగన్
- సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందకుండా చేస్తున్నారని ఆగ్రహం
- వెంటనే ఐదు మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకురావాలంటూ లేఖ



2లో

# అన్న క్యాంటీన్లపై సైకో జగన్ బ్యాచ్ విష ప్రచారం.!

**- ఐటీ మంత్రి నారా లోకేశ్.**



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు27: అన్నం పెట్టి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లపై సైకో జగన్ విషం చిమ్మటం కొనసాగిస్తూనే ఉన్నారని మంత్రి నారా లోకేష్ మండిపడ్డారు. విష ప్రచారం చేసేందుకే వైఎస్సార్సీపీ సైకో బ్యాచ్ తణుకు అన్న కాంటీన్‌లో చేతులు కడిగే సింక్‌లో తినే ప్లేట్లు పడేసిందని ధ్వజమెత్తారు. రుచి, శుచి, శుభ్రతకు అన్న క్యాంటీన్లో అత్యంత ప్రాధాన్యమిస్తూ ఉన్నారని స్పష్టం చేశారు.చేతులు కడుగు స్థలంలో వైఎస్సార్సీపీ మూకలు అన్నం ప్లేట్లు వేసి వీడియో తీసి ఫేక్ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై హరే కృష్ణ మూమెంట్ ప్రతినిధులు, అధికారుల నుంచి వివరాలు తీసుకున్న మంత్రి నారాయణ ప్లేట్లను మురికి నీటిలో కడుగుతున్నారనేది పూర్తిగా అవాస్తవమని అధికారులు చెప్పారని తెలిపారు. వాష్ బేసిన్‌లోని పేట్లు తీస్తుంటే వీడియో తీసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఒకేసారి అన్న క్యాంటీన్?కి ఎక్కువ మంది రావడంతో ప్లేట్లను డస్ట్ బిన్‌కు బదులుగా వాష్ బేసిన్‌లో పెట్టారని అధికారులు తెలిపారని మంత్రికి వివరించారు.

మిగతాది 3లో...

# రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదు.

- -రాష్ట్రంలో తూనికలు, ధరల్లో తేడాలు లేకుండా డీలర్లు చూసుకోవాలి
- -కొత్త చట్టాలను అనుసరించి నడుచుకోవాలి.
- -ఎరువులు తయారీదారులు, డీలర్ల సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



2లో

# వైసిపి జగన్ ను వదిలించుకున్న రోజా..!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 27: నటీనటులు ఎవరైనా తమ విడాకుల గురించి హింట్ ఇవ్వాలనుకుంటే%ా% సోషల్ మీడియాలో అన్ ఫాలో చేయడం.. కలిసి ఉన్న ఫోటోలను తీసేయడం చేస్తారు. ఇప్పుడు నటి కమ్ రాజకీయనాయకురాలు రోజా కూడా అదే చేస్తున్నారు. తన సోషల్ మీడియా ఖాతాల నుంచి వైసీపీ, జగన్ అనే పేర్లు, బొమ్మలు లేకుండా తీసేశారు. హఠాత్తుగా ఆమె ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో కానీ.. వైసీపీ వర్గాలు మాత్రం ఏదో ఉందని అనుకుంటున్నాయి.హెడర్‌లో తన వైసీపీ ఆనవాళ్లు లేవు. బయోలో తాను వైసీపీ నాయకురాలినని చెప్పుకోవడానికి ఇష్టపడలేదు. మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే అన్న హోదాలకు పరిమితం అయ్యారు. ఎందుకు ఇలా అన్నది వైసీపీలో విస్తృత చర్చ జరుగుతోంది. నగరి ఇంచార్జ్ గ రోజా ఉన్నారా లేదా అన్నదానిపై స్పష్టత కావాలని ఆమె అడిగినట్లుగా చెబుతున్నారు. సాధారణంగా పోటీచేసి ఓడిపోయిన వారంతా అక్కడ ఇంచార్జులుగా ఉంటారు. కానీ రోజా పార్టీ కార్యక్రమాలను నిర్వహించే విషయంలో హైకమాండ్ ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు.కేవలం రోజా వల్లనే నగరి వైసీపీ భ్రష్టుపట్టిపోయిందని.. ఆమెను వదిలించుకోవడమే మంచిదన్న వ్యూహంతో పార్టీ పనులు ఏమీ చెప్పడం లేదు. దేనికీ సమాచారం ఇవ్వడం లేదు. కనీసం సమావేశాలకు ఆహ్వానం రావడం లేదు. అందుకే కోపంతో ఇలా చేశారన్న వాదన వినిపిస్తోంది.



# దేవాలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరవాలి...

(మొదటి పేజీ తరువాయి)
ఏ మతంలో అయినా భక్తుల మనోభావాల ముఖ్యమని సిఎం అన్నారు. భక్తుల మనోభావాలకు, ఆగమశాస్త్ర నిబంధనలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేలా దేవాదాయ శాఖ అధికారులు పనిచేయాలని సిఎం సూచించారు. సులభతర దర్శనం, దేవాలయాల్లో పరిశుభ్రత, నాణ్యమైన సేవలు, బస చేయడానికి అనువైన కాటేజ్ లు, గదులు ఉండాలని అన్నారు. భక్తుల జేబులు ఖాళీ చేసే విధంగా కాకుండా, భక్తులు ఇష్టంగా అక్కడ గడిపే పరిస్థితి కల్పించాలని అన్నారు. టెంపుల్ టూరిజంకు మన దగ్గర అనేక అవకాశాలు ఉన్నాయని...వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలతో రావాలని సిఎం కోరారు. రిలీజియస్ టూరిజం ప్రమోషన్ కోసం దేవాదాయ శాఖ, అటవీ శాఖ, పర్యాటక శాఖల మంత్రులతో కమిటీ ఏర్పాటు కు నిర్ణయం తీసుకున్నారు. దేవాలయాల ట్రస్ట్ బోర్డుల్లో అదనంగా మరో ఇద్దరికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. రూ. 20 కోట్లు కంటే ఎక్కువ ఆదాయం ఉంటే 15 మంది బోర్డు సభ్యులుగా ఉంటారు. దీన్ని 17కు పెంచనున్నారు. ఇలా అన్ని ట్రస్ట్ బోర్డులలో ఇద్దరు చొప్పున అదనంగా సభ్యులను సంఖ్యను పెంచనున్నారు. ట్రస్ట్ బోర్డులో ఒక బ్రాహ్మణుడు, ఒక నాయీ బ్రాహ్మణుడు తప్పకుండా ఉండేలా చూస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు సభ్యుల సంఖ్యను పెంచి వారికి అవకాశం కల్పించనున్నారు. అదేవిధంగా రూ. 10 వేలు వేతనం పొందే అర్చకులకు ఇకపై రూ. 15 వేలు ఇవ్వనున్నారు. ఈ నిర్ణయం ద్వారా 1683 మంది లబ్ధి పొందనున్నారు. దీని వల్ల ప్రభుత్వం పై ఏటా రూ. 10 కోట్ల భారం పడుతుంది. అదేవిధంగా దూపదీప నైవేద్యాలకు దేవాలయాలకు ఇచ్చే మొత్తం రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతూ సిఎం నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఏడాదికి రూ. 32 కోట్ల అదనపు భారం పడుతుంది. వేద విద్య చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారికి నెలకు రూ. 3 వేలు భృతి ఇవ్వాలని సిఎం సూచించారు. నాయీ బ్రాహ్మణులకు కనీసం వేతనం రూ. 25 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ చేసుకున్న రోజును దేవాదాయ శాఖపరంగా గుర్తించి నిర్వహించేందుకు సిఎం నిర్ణయం తీసుకున్నారు. ఆర్యవైశ్య సంఘాల కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పరంగా అధికారికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సిజిఎఫ్ క్రింద, శ్రీవాణి ట్రస్ట్ నిధుల ద్వారా గత ప్రభుత్వం కొన్ని పనుల ప్రతిపాదించింది అయితే అందులో కొన్ని పట్టాలెక్కగా...కొన్ని పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికే మొదలైన పనులను పూర్తి చెయ్యాలని సిఎం సూచించారు. ఇదే సందర్భంలో ప్రారంభం కాని పనులను నిలిపివేసి మరో సారి వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. సిజిఎఫ్ క్రింద 243 పనులు ప్రారంభం కాలేదు. అలాగే టిటిడి శ్రీవాణి ట్రస్ట్ కింద వివిధ ప్రాంతాల్లో తలపెట్టిన 1797 దేవాలయాల పనులు ప్రారంభం కాలేదు. వీటిని నిలిపివేయాలని సిఎం ఆదేశించారు. శ్రీవాణి ట్రస్ట్ కింద చేపట్టే దేవాలయాలు, ఇతర నిర్మాణాల పై చర్చించి...అవసరం అయితే వాటికి కేటాయించే నిధులు పెంచి పనులు ప్రారంభిద్దాం అని ముఖ్యమంత్రి సూచించారు. గతంలో పల్లెల్లో, వాడల్లో శ్రీవాణి ఆలయ నిర్మాణం ట్రస్ట్ ద్వారా రూ. 10 లక్షలు ఇచ్చేవారు. వీటితో ఆలయాల నిర్మాణాలు సాధ్యం కావడం లేదని అధికారులు వివరించారు. దీంతో ఈ మొత్తాన్ని పెంచడానికి, రెట్టింపు చేసి ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిఎం సూచించారు. ప్రతి గ్రామంలో, ప్రతి వాడలో దేవాలయం ఉండేలా చూడాలన్నారు. అదే సమయంలో శ్రీవారి నిధులు ఖర్చుకు జవాబుదారీగా కూడా ఉండాలని సిఎం అన్నారు. దేవాలయ ఆస్తుల పరిరక్షణకు కమిటీల ఏర్పాటు చేయాలని కూడా సమీక్షలో సిఎం అధికారులకు ఆదేశించారు. గోదావరీ, కృష్ణా నదీ హారతులు మళ్లీ నిర్వహించాలని సిఎం సూచించారు. ప్రతి దేవాలయంలో ఆన్ లైన్ విధానం అమలు చేయాలని, అన్ని సర్వీసులు ఆన్ లైన్ ద్వారా అందాలని సీఎం అన్నారు. గుడికి వచ్చే భక్తులు దర్శనం చేసుకుని వెళ్లడమే కాకుండా ప్రత్యేక పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. అవసరం అయితే ప్రైవేటు సెక్టార్ భాగస్వామ్యంతో హొటళ్ల నిర్మాణం చేపట్టి భక్తులకు వసతులు కల్పించాలని సీఎం అన్నారు. ధనికులే కాకుండా సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా బస చేసే పరిస్థితి ఉండాలని సీఎం అన్నారు. దేవాలయాలకు విరాళాలు ఇచ్చిన వారిని ప్రోత్సహించండి...వారి పేర్లు ప్రకటించండి అని అధికారులకు సూచించారు. గతంలో దేవాలయాల్లో జరిగిన పలు ఘటనలపై లోతుగా విచారణ జరపాలని అన్నారు. రానున్న రోజుల్లో దేవాలయాల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని సిఎం అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# సుగాలి ప్రీతి మృతిపై సిబిఐ విచారణ జరిపించండి.

## ఏపీ హోంమంత్రి అనితను కలిసిన సుగాలి ప్రీతి తల్లి

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు27:
ఏడేళ్ల(2017) కిందట కర్నూలులోని ఓ ప్రైవేటు స్కూల్లో సుగాలి ప్రీతి అనే విద్యార్థిని ఫ్యాన్ కు ఉరేసుకున్న స్థితిలో విగతజీవురాలిగా దర్శనమిచ్చింది. సుగాలి ప్రీతి ఉరేసుకుని చనిపోయిందని స్కూల్ యాజమాన్యం పేర్కొనగా... స్కూల్ కరస్పాండెంట్ కుమారులు అత్యాచారం చేసి చంపేశారని బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ కేసు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది.
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా సుగాలి ప్రీతి వ్యవహారంపై పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో, సుగాలి ప్రీతి తల్లి పార్వతీదేవి నేడు అమరావతిలోని



రాష్ట్ర సచివాలయంలో ఏపీ హోంమంత్రి అనితను కలిశారు. తమ కుమార్తెకు జరిగిన అన్యాయం పట్ల వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... న్యాయం కోసం ఏడేళ్లుగా తిరుగుతున్నామని ఆమె ఆక్రోశించారు. పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీతో న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగిందని అన్నారు.
సుగాలి ప్రీతి కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్టు గత ప్రభుత్వం జీవో ఇచ్చిందని పార్వతీదేవి వెల్లడించారు. సీబీఐ విచారణ ప్రారంభం కాకపోవడంతో ఢిల్లీ కూడా వెళ్లామని తెలిపారు. ఆ జీవో టిష్యూ పేపర్ తో సమానమని అధికారులు చెప్పడం తమను మరింత కుంగిపోయేలా చేసిందని వాపోయారు. గత ప్రభుత్వం ఫేక్ జీవోలతో తమను మోసం చేసిందని అన్నారు. సీఎస్ గా పనిచేసిన జవహర్ రెడ్డి కూడా తమకు అన్యాయం చేశారని పార్వతీదేవి వ్యాఖ్యానించారు.
తాజాగా, ఈ కేసును సీఐడీకి అప్పగిస్తామని హోంమంత్రి అనిత చెప్పారని, ఈ కేసును సీఐడీ చీఫ్ రవిశంకర్ స్వయంగా విచారిస్తారని హామీ ఇచ్చారని వివరించారు.

# రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదు.

ఆంధ్ర ప్రగతి మంగళగిరి ఆగస్టు 27: 'కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వం. ప్రతి అడుగులో రైతుని ఆదుకునేందుకు అంకిత భావంతో పని చేస్తుంది. రైతుకి భరోసా ఇచ్చే విధంగా ముందుకు వెళ్తుంద'ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎరువులు, పురుగు మందుల తయారీదార్లు, డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యూరియా, డి.ఏ.పి., ఎరువులు, పురుగు మందుల అమ్మకాల విషయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కొలతలు, ధరల్లో తేడాలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. రైతు మోసపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బరువు, ఎమ్మార్పీల్లో తేడాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ జనవరి నుంచి అమల్లోకి వచ్చిన యూనిట్ సేల్ ప్రైస్ నిబంధనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ బి. రామ్ కుమార్ తూనికలు, కొలతల శాఖలో కొత్తగా వచ్చిన చట్టాలు, నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుకి ఎక్కడా ఇబ్బంది కలుగకుండా, అన్నదాతకు భరోసా కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ముందుకు వెళ్తున్నాం. ధాన్యం సేకరణ దగ్గర నుంచి కనీస మద్దతు ధర పకడ్బందీగా ప్రతి రైతుకీ అందించే విధంగా ఈ ఖరీఫ్ సమయానికి సిద్ధం అవుతున్నాం. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా తూనికలు, కొలతల శాఖ నిర్వహించిన తనిఖీల్లో యూరియా, డీఏపీ ధరలు, కొలతల్లో తేడాలు, బ్లాక్ మార్కెటింగ్ కారణంగా రైతులకు ఇబ్బంది కలుగుతున్న విషయం దృష్టికి



వచ్చింది. కొన్ని చోట్ల దుకాణాల వద్ద ఎంఆర్పీని రౌండ్ ఫిగర్ చేసి అమ్ముతున్నారు. రైతులు ఎంత కష్టపడి పంట పండిస్తున్నారో అందరికీ తెలుసు. ఎంఆర్పీ కంటే ఎక్కువ ధర తీసుకోవడం అంటే మోసం చేస్తున్నారన్న భావన రైతుల్లో కలుగుతుంది.

### 252 కేసులు నమోదు

తూనికలు, కొలతల శాఖ నుంచి ఇటీవల క్షేత్ర స్థాయిలో చేపట్టిన తనిఖీల్లో రాష్ట్రవ్యాప్తంగా 252 కేసులు నమోదు చేశాం. అందులో ఎక్కువ కేసులు కొలతల్లో తేడాలు ఉన్నాయని పెట్టినవే ఉన్నాయి. రైతుని ఇబ్బంది పెట్టే విధంగా కొలతల్లో తేడాలు చేస్తే ఉపేక్షించేది లేదు. ఒక్కోచోట బస్తాకి రెండు, మూడు కేజీలు తేడాలు ఉంటున్నాయి. కొలతల విషయంలో తేడాలు ఉండకూడదు. ప్రతి బ్యాగు బరువు చూసి అమ్మాలి. మరికొన్ని అధిక ధరల వసూళ్లకు సంబంధించిన కేసులు ఉన్నాయి. రవాణాలో బరువు తగ్గితే ఉన్న కొలత లెక్క కట్టి దాని మేరకే ధర చెల్లించే ఏర్పాటు చేయాలి. ఎక్కడా రైతుకి మాత్రం ఇబ్బంది కలుగ కుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.గత ప్రభుత్వంలో రైతులు ఇబ్బంది పడ్డారు
గత ప్రభుత్వంలో రైతులు చాలా ఇబ్బందులుపడ్డారు. ఎరువులు, విత్తనాల కొరత ప్రధానంగా రైతుని ఇబ్బందిపెట్టింది. మన ప్రభుత్వంలో అలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి నెలా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షించి రైతుల పక్షాన నిలబడతాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాల్లో ఎప్పటికప్పుడు మార్పులు వస్తాయి. మారిన చట్టాలకు అనుగుణంగా అంతా ముందుకు వెళ్లాలి. కొత్తగా అమల్లోకి వచ్చిన యూనిట్ సేల్ ప్రైస్ నిబంధనను తయారీదార్లు కచ్చితంగా అమలు చేయాలి. అదే సమయంలో తయారీదార్లు క్షేత్ర స్థాయిలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా దృష్టి సారించాలి. తయారీదార్లు, డీలర్లకి కొత్త చట్టాల పట్ల అవగాహన కల్పించడం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేశాం. ప్రభుత్వం ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటుంది. రైతుకి భరోసా కల్పించకపోతే మనం తప్పు చేసిన వారిమవుతాము.

### రైతు సంతోషమే మన సంతోషం

మా ప్రభుత్వం ఎల్లవేళలా వినియోగదారుడి పక్షాన నిలబడుతుంది. రైతు సంతోషంగా ఉంటేనే మనమంతా సంతోషంగా ఉంటాము. సరుకు కొరత వల్ల బ్లాక్ మార్కెట్ జరుగుతోందని చెబుతున్నారు. మనం మంచి చేయాలి అనుకుంటే ఎలాగైనా చేయెచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు ధరల్ని నియంత్రించిన విధానం అందుకు ఉదాహరణ. కంది పప్పు కేజీ రూ.180 ఉన్నప్పుడు హోల్ సేలర్స్, రిటెయిలర్స్ తో సమావేశం ఏర్పాటు చేస్తే మొదట రూ.160కి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఇప్పుడు శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు మరో రూ.10 తగ్గించి రూ.150కి కేజీ ప్రజలకు ఇవ్వగలుగుతున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు. తయారీదార్లు, డీలర్లు రైతుల్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్లాలి. ఖరీఫ్ సమయానికి మీ నుంచి సహకారం అవసరం. ఉద్దేశపూర్వకంగా ఎవరి మీదా కేసులుపెట్టం. ప్రభుత్వపరంగా చట్టానికి లోబడి ముందుకు వెళ్తాం. అంతా రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. రైతుని కాపాడుకుందాం" అన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట.

## -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 27:
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ ల పరిధిలలో అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉంచేందుకు మరియు చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేందుకు విజిబుల్ పోలీసింగ్ మరియు ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా నంద్యాల పట్టణ శివారు ప్రాంతాల్లో, నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సదరు ప్రాంతాలపై అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచడం మరియు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై డ్రోన్ ల సహకారంతో వారిని కనుగొని వారిపై కేసు నమోదు చేయడం జరుగుతుంది. ఇందులో భాగంగా నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువు కట్ట చుట్టుపక్కల ప్రాంతాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై మరియు బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులో నమోదు చేయడం జరిగింది. ఇదేవిధంగా ప్రతి సబ్ డివిజన్ కు ఒక డ్రోన్ కెమెరాను ఇవ్వడంతో పాటు విస్తృతంగా అసాంఘిక శక్తులు,చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై గాలింపు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలియజేశారు.

# ఏపీని బెస్ట్ ఎనర్జీ ఎఫిషియంట్ స్టేట్ గా మార్చుతాం.!

## -ఏపీ సీఎం చంద్రబాబు.

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 27 : ఆంధ్రప్రదేశ్ ను బెస్ట్ ఎనర్జీ ఎఫిషియంట్(ఉత్తమ ఇంధన సామర్థ్యం) రాష్ట్రంగా మార్చుతామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ రంగంలో మార్పులకు శ్రీకారం చుట్టామని అన్నారు. సచివాలయంలో ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) సీఈఓ విశాల్ కపూర్, ఆ సంస్థ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు మంగళవారం సమావేశమై రాష్ట్రంలో ఎనర్జీ ఎఫిషియన్సీ పెంచడానికి చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. పీఎంఏవై పథకంలో భాగంగా ఇళ్లకు ఇంధన సామర్థ్య పరికరాలు సబ్సీడీలో అందించడం, సబ్సీడీలో ఈ-సైకిల్, ప్రభుత్వ ఉద్యోగులకు విద్యుత్ పరికరాలు సబ్సీడీలో అందజేయడంతో పాటు పలు అంశాలపై ఈఈఎస్ఎల్ సంస్థ ప్రతినిధులు సీఎంతో చర్చించారు. ఎలక్ట్రిక్ సైకిళ్లను సబ్సీడీలో డ్వాక్రా మహిళలకు, విద్యార్థులకు అందిస్తామని ఈఈఎస్ఎల్ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఎలక్ట్రికల్ సైకిల్ మోడల్స్ ను సీఎంకు చూపించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..ఈఈఎస్ఎల్ తో గృహ నిర్మాణ, ఇంధన, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ సహా పలు కీలక విభాగాలు కలిసి పనిచేస్తాయన్నారు. ఇంధన సామర్థ్యంలో రాష్ట్రానికి మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి ఆర్థికంగా, పర్యావరణ పరంగా లబ్ధి చేకూరేలా విధానాలు ఉండాలని, ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఈఎస్ఎల్ ప్రతినిధులకు సూచించారు. ఆర్టీసీలో కూడా పెద్ద ఎత్తున విద్యుత్ వాహనాలను ప్రమోట్ చేస్తున్నామని, ప్రభుత్వ భవనాల్లో కూడా సోలార్ వినియోగం పెంచబోతున్నట్లు తెలిపారు. ఎనర్జీ జనరేషన్ తో పాటు సేవింగ్ కూడా ముఖ్యమని సీఎం అన్నారు. స్వల్పకాలి ప్రయోజనాలతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. గతంలో రాష్ట్రంలో 25 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశామని, కానీ తర్వాత వచ్చిన ప్రభుత్వం వాటి నిర్వహణను గాలికొదిలేసిందని అన్నారు. దీని వల్ల 60 శాతం వీధి దీపాలు మాత్రమే వెలుగుతున్నాయని అన్నారు. త్వరలో మళ్లీ ఎల్ఈడీ దీపాల వెలుగులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈఓ విశాల్ కపూర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదు.!

ఆంధ్రప్రదేశ్ తాడేపల్లి ఆగస్టు27: రాష్ట్రంలో ప్రజారోగ్య రంగానికి మీ ప్రభుత్వం ఉరితాడు బిగుస్తోంది. సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందకుండా చేస్తోంది. ఇప్పటికే స్పెషలిస్టు వైద్యుల సహా సిబ్బంది నియామకాల్ని ఆపడంతో జీరో వేకెన్సీ పాలసీకి గండి కొడుతున్నారు. మరోవంక బిల్లులు చెల్లించకుండా ఆరోగ్య శ్రీని నీరుగారుస్తున్నారు. తద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తిరిగి ఆస్తులు అమ్ముకునే పరిస్థితిని తీసుకు వస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రారంభం కావాల్సిన ఐదు మెడికల్ కాలేజీలను ఉద్దేశపూర్వకంగా మీరు నిర్లక్ష్యం చేయడం దీనికి ఇంకో సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ ఏడాది ఆ కాలేజీల్లో తరగతులు ప్రారంభంకాకపోవడం మీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం.వైయస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో ప్రజారోగ్య రంగాన్ని పటిష్టం చేయడం కోసం అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చాం. దీంట్లో భాగంగా విలేజ్-వార్డు క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, మండలానికి 2 పీహెచ్సీలు,108,104 సర్వీసులు గణనీయంగా పెంపు, ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3,257 చికిత్సలు, చికిత్స కాలంలో కోలుకునేందుకు దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆరోగ్య ఆసరా, ప్రతి ఇంటిని జల్లెడపడుతూ ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాలు ఎప్పుడూ లేని విధంగా చేపట్టాం. ఆస్పత్రుల్లో నాడు-నేడు, కొత్త మెడికల్ కాలేజీలకోసం రూ.16,880 కోట్లతో పనులు చేపట్టాం. ఇవన్నీ చివరిదశకు వచ్చాయి. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ చొప్పున 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని రూ.8,480 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టాం. పటిష్టమైన ప్రణాళిక వల్ల 2023-24 విద్యా సంవత్సరంలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీల్లో తరగతులు కూడా ప్రారంభం అయ్యాయి. తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. పేద విద్యార్థులకు ఎంతో మేలు జరిగింది. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరంలో మరో ఐదు చోట్ల, పాడేరు, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని కాలేజీల్లో క్లాసులు ప్రారంభం కావాల్సి ఉంది. అన్ని వసతులూ ఉన్నా, చంద్రబాబూ%ొ% మీ వైఖరి కారణంగా వీటికి గ్రహణం పట్టింది. కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న బీజేపీతో పొత్తులో ఉన్నా మీరు అనుమతులు తెచ్చుకోలేకపోయారు. ఇది మీ వైఫల్యంకాదా? ఫలితంగా మరో 750 సీట్లు అందుబాటులోకి రాకుండాపోయాయి. దీంతోపాటు కొత్తకాలేజీల్లో మెడికల్ సీట్లన్నింటినీ కూడా కన్వీనర్కోటాలో భర్తీచేస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూడా గాలికొదిలేశారు. మెడికల్ కాలేజీలన్నింటినీ ప్రైవేటుపరం చేసి, సామాన్యుల నెత్తిన భారం మోపే విధానాల్లోకి వెళ్తున్నారు. పీపీపీపీ మోడల్ అంటూ ప్రయివేటు కోసం, ప్రయివేటు కొరకు, ప్రయివేటు చేత, ప్రయివేటు వల్ల నడుపుతున్న వ్యవస్థలా ప్రజారోగ్యరంగాన్ని మార్చేసి సామాన్యుడికి నాణ్యమైన వైద్యం అందుబాటులోలేని పరిస్థితిని తీసుకు వస్తున్నారు. ఈ విధానాలను ఇప్పటికైనా మార్చుకోండి. ప్రయివేటు సంస్థలకు పోటీగా ప్రభుత్వరంగం ఉన్నప్పుడే, ఆ పోటీ కారణంగా రేట్లు అదుపులో ఉంటాయి. వెంటనే స్పందించి ఈ సంవత్సరం ఆ 5 కాలేజీల్లో తరగతులు ప్రారంభం అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను. మేం శరవేగంగా నిర్మించిన కాలేజీలకు మిగిలిన ఆ సొమ్మును కూడా విడుదలచేస్తూ ఈ సంవత్సరం కొన్ని, వచ్చే సంవత్సరం మిగిలిన అన్నీ పూర్తిచేసేదిశగా అడుగులు వేయండి. మీ మద్దతుపైనే కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉంది. ఆ పలుకుబడిని వాడుకుని ఆ ఐదు కాలేజీలకు వెంటనే అనుమతులు తీసుకురావాలని కోరుతున్నాను.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 28 ఆగష్టు 2024

# జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

## ప్రమాద సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి.

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**







ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 27:
జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు, పరిశ్రమల్లో భద్రత భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించి ఉద్యోగులు, కార్మికుల రక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత నిర్వాహకులను సూచించారు.
మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇటీవల జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో జిల్లాలోని ఫ్యాక్టరీలు, పరిశ్రమల నిర్వాహకులు, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు, పరిశ్రమలలో అంతర్గత సేఫ్టీ ఆడిట్ త్వరితగతిన నిర్వహించి గుర్తించిన లోపాలను సరి చేస్తూ భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని రకాల పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు అతిక్రమించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఉన్న 32 ఫ్యాక్టరీలు, 1500 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలలో పనిచేస్తున్న 28,000 మంది ఉద్యోగుల భద్రతతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని చోట్లా మాక్ డ్రిల్స్ కండక్ట్ చేయాలని, ప్రమాదాలపై కార్మికులకు, సమీప నివాసితులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి కంపెనీ పరిసరాల్లో అలారం సిస్టం తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. లాభాపేక్ష కాకుండా కార్మికుల సంక్షేమం, రక్షణను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలని హితవు పలికారు. జిల్లాలోని అన్ని పారిశ్రామిక యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ పాయింట్లను సంబంధిత విభాగాల అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలని, లోపాలుంటే తక్షణమే సరిదిద్దేలా యాజమన్యాలకు నోటీసులు ఇవ్వాలని చెప్పారు. 33 శాతం గ్రీనరీ మెయింటైన్ చేసేలాగా చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. అనుకోని ఘటనలు సంభవించినప్పుడు స్వీయ రక్షణ పొందేలా కార్మికులకు, ఉద్యోగులకు శిక్షణ ఇప్పించాలని చెప్పారు. అలాగే అధికారులు నిబంధనల అమలు విషయంలో రాజీపడొద్దని హితవు పలికారు.
జిల్లాలో పారిశ్రామిక యూనిట్ల నెలకొల్పనకు అధిక అవకాశాలు ఉన్నాయని.... ఈ మేరకు సంబంధిత అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేస్తూ ప్రతి ఏడాది 15% వృద్ధి వృద్ధిరేటుతో మెరుగైన ర్యాంకింగ్ సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఎస్ఎంఈ రంగంలో మన జిల్లా దిగువ స్థానంలో ఉందని ఆమె గుర్తు చేశారు.
జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాల భద్రతా ప్రమాణాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చట్ట ప్రకారం నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతిస్పందన, స్వీయ రక్షణపై కార్మికులు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సేఫ్టీ మెకానిజం డెవలప్ చేయడంతో పాటు ఎస్ఓపి ప్రకారం నిబంధనలను పాటిస్తూ కంటింజెంట్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు.
ఈ సమావేశంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ వై. శ్రీనివాసరెడ్డి, అగ్నిమాపక అధికారి జి.బాలరాజు, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిప్రసాద్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీనివాస యాదవ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బహిరున్నిసా బేగం తదితరులు పరిశ్రమలలో చట్టపరమైన అంశాలపై వివరించారు.

# ఫ్రీ హోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయకండి.

**-రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




ఆంధ్రప్రగతి నంద్యాల, ఆగస్టు 27:
ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ పై జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని ఫ్రీ హోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించారు. నిషేధిత ఆస్తుల జాబితాకు సంబంధించి సెక్షన్ 22 ఏ పరిధిలోకి వచ్చు అసైన్డ్ భూములు, గవర్నమెంట్ ల్యాండ్స్, దేవాలయ భూములకు సంబంధించి అన్యాక్రాంతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వారసత్వం ప్రకారం సంక్రమించే ఇంటి స్థలాలు, ఇండ్లు మొదలైన వాటికి లింక్ దస్తావేజులు లేనప్పుడు మండల తాసిల్దార్ లేదా మండల డెవలప్మెంట్ అధికారి వారిచే ధ్రువీకరణ పత్రము జారీ చేసే విధంగా ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మజ, జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి, సబ్ రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

# అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం "RBI90Quiz"

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



ఆంధ్రప్రగతి నంద్యాల, ఆగస్టు 27:
రిజర్వ్ బ్యాంక్ స్థాపించి 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని »RBI90Quiz పేరుతో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం RBI ' దేశవ్యాప్తంగా క్విజ్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం తన ఛాంబర్ లో RBI90Quiz పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. డిఆర్ఓ ఎ. పద్మజ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్ జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.
జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులలో రిజర్వ్ బ్యాంక్ మరియు ఆర్థిక పర్యావరణ వ్యవస్థ గురించి మరింత అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు ఈ క్విజ్ సహాయపడుతుందన్నారు. ఆర్థిక ప్రవర్తనను పెంపొందించుకోవడం, డిజిటల్ ఫైనాన్షియల్ ఉత్పత్తుల సురక్షితమైన వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. క్విజ్లో నాలుగు దశలు ఉంటాయని... రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయి విజేతలకు రూ.లక్ష నుండి రూ.10 లక్షల వరకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయబడతాయన్నారు. క్విజ్ లో పాల్గొనే విద్యార్థులు https://www.rbi90quiz.in ఆన్లైన్ లో సెప్టెంబర్ 17 వరకు నమోదు చేసుకోవచ్చున్నారు. ఇతర వివరాలకు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

# ఎన్ని యుగాలు మారినా మానవ జాతి ఉన్నంతవరకు శ్రీమద్రామాయణమే ఆదర్శం.

**-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.**

**-ఆర్. పాంపల్లిలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు.**



ఆంధ్ర ప్రగతి ఉయ్యాలవాడ ఆగస్టు 27:
ఎన్ని యుగాలు గడిచినా మానవజాతి ఉన్నంత వరకు శ్రీమద్రామాయణమే ఆదర్శంగా నిలుస్తుందని, మానవీయ విలువలకు కట్టుబడిన ప్రతి ఒక్కరు శ్రీ సీతారాముల ఆదర్శ జీవితాన్ని పుణికి పుచ్చుకుంటారని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ మండలం, ఆర్.పాంపల్లె గ్రామంలోని శివాలయం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ జీ మానవ సమాజంపై శ్రీమద్రామాయణం ఎంతటి ప్రభావితం చూపుతూ ఉందో వివరించారు. ఈ కార్యక్రమంలో తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు టి. వి. వీరాంజనేయరావు, స్థానిక అర్చకులు టి. నరసింహయ్య శర్మ, భజన మండలి సభ్యులు అన్నెం నాగేశ్వరమ్మ, అల్లె శివమ్మ, జి.చిన్న రామసుబ్బారెడ్డి, సోము పెద్ద సుబ్బారెడ్డి, జి.వెంకటనర్సయ్య, ఎ.నర్సయ్య, జి.బాల వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుని పల్లకి సేవలో పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్.



ఆంధ్రప్రగతి నంద్యాల ఆగస్ట్ 27:
నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ లో ఉన్న శ్రీకృష్ణుని దేవాలయం నందు కృష్ణాష్టమి సందర్భంగా రెండవ రోజు శ్రీకృష్ణ టెంపుల్ కమిటీ సభ్యులు మరియు మాజీ కౌన్సిలర్ వాకా శివశంకర్ యాదవ్ వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని పల్లకి సేవను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , టిడిపి రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి పల్లకి సేవలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ శ్రీకృష్ణుని పల్లకి సేవలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని కృష్ణ భగవానుడు ప్రతి కుటుంబాన్ని ఆదుకొని ఆరోగ్యంతో ఐశ్వర్యంతో ఆశీర్వదించాలని, గీత సారాంశం తో ప్రతి ఒక్కరి మనసును కదిలింపజేసి దైవం పట్ల భక్తిశ్రద్ధలతో ఉండాలని తెలియజేయడం అదేవిధంగా తమ కర్తవ్యాలను మర్చిపోకుండా ఉండాలని తప్పు చేసిన ప్రతి ఒక్కరికి శిక్ష తప్పదని అందులో ఉందన్నారు. అలాగే ఆ కృష్ణుని కృపాకటాక్షం నంద్యాలపై ఎల్లవేళలా ఉంటూ నంద్యాల అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు.
ఈ కార్యక్రమంలో పార్థసారథి వాకా వరప్రసాద్ యాదవ్ సాయి సప్లయర్స్ గోపాల్ కౌన్సిలర్ నాగార్జున మాజీ కౌన్సిలర్ అజ్మీర్ 19వ వార్డు వడ్డే జనార్ధన్ పృధ్వీరాజ్ యాదవ్ చంద్ర స్వామి ఒంటలగల భాస్కర్ రెడ్డి పెరుగు నరేష్ కుమార్ యాదవ్ రవి తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లపై సైకో జగన్ బ్యాచ్ విష ప్రచారం.!

(మొదటి పేజీ తరువాయి)
అన్న క్యాంటీన్లలో ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయన్న హరే కృష్ణ మూమెంట్ ప్రతినిధులుసోషల్ మీడియాలో పెట్టిన వీడియో వాస్తవం కాదని స్పష్టం చేశారు.
2014 - 2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన అన్న క్యాంటీన్లు నిరుపేదలకు పట్టెడన్నపెట్టేవి. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం వీటిని మూసివేసి సామాన్యులకు అన్యాయం చేసింది. మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చాక తిరిగి అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎన్డీయే ప్రభుత్వం, తాజాగా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంట్టుకున్న విషయం తెలిసిందే. 203 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించినా, మొదట భావించినా భవన నిర్మాణ పనులు పూర్తి కానందున తొలి విడతలో 100 క్యాంటీన్లు ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# నిరుద్యోగ భృతి 45 సంవత్సరాల వరకు ఇవ్వాలి.

## -డిఏస్సీ పరీక్షలు ఆఫ్ లైన్ లోనే నిర్వహించాలి.

**నంద్యాల జిల్లా ఏఐ వై యఫ్ జనరల్ బాడీ సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఏఐ వై యఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు**




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 27:
ఈ సందర్భంగా నంద్యాలసిపిఐ కార్యాలయంలో ఏఐ వై యఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. జనరల్ బాడీ సమావేశంలో ఏఐవైయఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేని బాబు, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐవైయఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు సుంకయ్య,ఏఐయఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ..
రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి శ్వేతా పత్రం విడుదల చేయాలని , డిఏస్సీ పరీక్షలు ఆఫ్లైన్లోనే నిర్వహించాలని అంతేకాకుండా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇస్తామన్నా ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని,రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతిని 45 సంవత్సరాల వరకు ఇవ్వాలని,నిరుద్యోగ భృతిని పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ధనుంజయుడు ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ రవి, విష్ణు, మధు,ధనుంజయ్, లక్ష్మయ్య మరియు కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు పాల్గొన్నారు

# పీఎంజె జ్యువెలరీస్ స్టాల్ ను ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్






ఆంధ్రప్రగతి నంద్యాల ఆగస్ట్ 27:
నంద్యాల సౌజన్య ఫంక్షన్ హాల్ నందు పీఎంజె జ్యువెలరీస్ స్టాల్స్ ను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ టిడిపి రాష్ట్ర కార్యదర్శి తులసి రెడ్డి డాక్టర్ ఆరిఫా భాను లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. నంద్యాలలో పిఎంజె జువెలరీ స్టాల్ ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని నంద్యాల ప్రజలు ఎక్కడెక్కడో తిరగాల్సిన అవసరం లేదని వారికి కావాల్సిన రీతిలో అనేక మోడల్స్ లో నగలు గొలుసులు ఉంగరాలు కడియాలు కమ్మలు ఇలాంటి అన్ని రకాల బంగారు వస్తువులు ఇక్కడ లభ్యమవుతాయని కాబట్టి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సౌజన్య ఫంక్షన్ హాలు విచ్చేసి స్టాల్స్ లో ఏర్పాటు చేసిన డిజైన్స్ అన్ని చూసి మీకు నచ్చని వస్తువును మీరు కొనుగోలు చేయాలని బయట షాపులో కన్నా ఇక్కడ ధర తక్కువ నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు . అనంతరం స్టాల్స్ లో ఏర్పాటుచేసిన బంగారు ఆభరణాలను తిలకించడం జరిగింది.

# గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి

**-విద్యుత్ కనెక్షన్లకు కూడా పర్మిషన్ తీసుకోవాలి.**

**-గణేష్ నిమజ్జన మహోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టండి.**

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 27: గణేష్ విగ్రహ నిమజ్జన మహోత్సవ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణంలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగేలా ఇప్పటి నుండే పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సెప్టెంబర్ 11న స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్ లో గణేష్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు ఇప్పటినుండే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నంద్యాల పట్టణంలో గణేష్ మండపాల స్థాపనకు మున్సిపల్ కమిషనర్ నుండి, విద్యుత్ కనెక్షన్లకు ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం నుండి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పవర్ ఆషామాషీగా తీసుకోవడానికి వీల్లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. దాదాపు 500 వినాయక విగ్రహాలు నిమజ్జనం కానున్నట్లు అధికారులు వెల్లడిస్తున్న నేపథ్యంలో స్థానిక చిన్న చెరువు, కేసి కెనాల్, కుందూనది ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లకు ప్లాట్ ఫామ్, క్రేన్స్, లైటింగ్, బారి కేడింగ్, పుట్టిలతో స్విమ్మర్లు, వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చిన్న చెరువు ప్లాట్ ఫామ్ బలహీనంగా ఉందని పటిష్టం చేసినందుకు చర్య తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఊరేగింపు ప్రదేశాల్లోని ముఖ్య కూడలి ప్రాంతాల్లో త్రాగునీటి వసతి ఏర్పాట్లతో పాటు ముమ్మర పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాలో పటిష్ట




బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భారీ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేయాలని రవాణా శాఖ అధికారిని ఆదేశించారు. చిన్న చెరువు, కుందూ నది, కె.సి. కాలువ సమీపంలో పుట్టీలతో పాటు అవసరమైన స్విమ్మర్లను, లైఫ్ జాకెట్, రోప్స్ తదితర మెటీరియల్ తో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ డీడిని కలెక్టర్ ఆదేశించారు. గాంధీ చౌక్, చిన్న చెరువు సమీపంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని డియంహెచ్వోను ఆదేశించారు. గణేష్ విగ్రహాలు ప్రయాణించే రోడ్డు మార్గాలైన మున్సిపల్ ఆఫీసు, సంజీవనగర్ గేటు, శ్రీనివాస సెంటర్, సిటీ బస్టాండ్, గాంధీచౌక్, కల్పనా సెంటర్, బైర్మల్ వీధి, బంగారు అంగళ్ల వీధి, రాజ్ థియేటర్, టెక్కె, సాయిబాబానగర్, ఎన్టీఓస్ కాలనీ, కోవెలకుంట్ల జంక్షన్, బొమ్మలసత్రం తదితర ప్రాంతాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఊరేగింపు రహదారుల్లో విద్యుత్ తీగలు కిందకు వ్రేలాడకుండా పైకి సర్దుబాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ఉత్సవ మరియు శాంతియుత కమిటీ సభ్యులతో చర్చించి అవసరమైన ఏర్పాట్లు గైకొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఇదే తరహాలో మండలాల్లో కూడా నిమజ్జన ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ రూట్ మ్యాప్ ప్రకారం గణేష్ విగ్రహాల ఊరేగింపుకు పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ మాట్లాడుతూ సంబంధిత శాఖలు సమన్వయంతో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు చేయాలని ఆవేశించారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ పద్మజ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 40 సం"ల రాజకీయాలలో మచ్చలేని నాయకుడు ఎన్ ఎం డి. ఫరూక్.!

**-నశ్యం కుటుంబం పై కబ్జా అసత్య ఆరోపణల తో రాయడం శాడిజం.**

**-నశ్యం కుటుంబంలోని ఆస్తివివాదంలో ఒక పత్రికలో వచ్చిన అవాస్తవ రాతలను ఖండిస్తున్నాం.**

**-ఆకాశం పై ఉమ్మి వేస్తే ఏమవుతుందో అందరికీ తెలుసు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 27'**
నంద్యాలలో ఓటమి జీర్ణించుకో లేకనే మైనార్టీ వర్గానికి చెందిన ఎన్ఎండి ఫరూక్ పై అవినీతి అక్రమాల ఆరోపణ తో అక్కసు వెళ్లగక్కుతున్నది మైనార్టీ మరియు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోదరుడు కుద్దూస్ ఆరోపించారు.

ఎన్ఎండి ఫరూక్ అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో కాకుండా దేశవ్యాప్తంగా రాజకీయరంగంలో మచ్చలేని రాజకీయ నాయకుడిగా కొనసాగుతున్నారన్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయాలలో ఒకే పార్టీలో ఉంటూ ఎన్నో ఉన్నత పదవులు పొంది, ప్రజాభిమానం కలిగిన నేత ఎన్ ఎం డి ఫరూక్అన్నారు. ప్రత్యర్థి పార్టీలకు చెందిన వారుసైతం కూడా ఎన్ఎండి ఫరూక్ ను అభిమానిస్తారన్నారు. అలాంటి మచ్చలేని నాయకుడి పై అధికారమే అండ... అక్రమాలే అజెండా శీర్షిక తో ఒక పత్రికలో రాసిన కథనాన్ని చూసి నంద్యాల ప్రజలందరూ ఆపత్రిక పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ లో ఉన్న 58 కోట్ల విలువైన భూమిని కొట్టేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడంటూ అసత్య ఆరోపణలతో రాసిన కథనంలో నిజం లేదంటూ, నశ్యం కుటుంబానికి చెందిన భూ వివాదంలో కోర్టులో ఉన్న వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించే విధంగా వాస్తవాలను దాచిపెట్టి, కొందరి ప్రయోజనాల కోసం వకల్తాపుచ్చుకున్న ఆ పత్రిక ఎన్ ఎం డి ఫరూక్ పై లేనిపోని ఆరోపణలతో ఖరీదైన స్థలాన్ని కబ్జా చేస్తున్నాడు అంటూ అసత్య రాతలు రాయడాన్ని నశ్యం కుటుంబ సభ్యులందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు.


ఈ సందర్భంగా మంగళవారం నాడు టిడిపి కార్యాలయం రాజ్ టాకీస్ నందు విలేకరుల సమావేశంలో ఎన్ఎండి ఖుద్దూస్ , ఎన్ఎండి ఫిరోజ్ , అడ్వకేట్ తులసి రెడ్డి మాట్లాడుతూ...

నంద్యాలలో సర్వే నంబర్లు 700%ూ7దీ, 700ూ%9 కు సంబంధించి 4.16 ఎకరాల భూమిని భాగ పరిష్కార దస్తావేజులో భాగంగా 1953 లో నశ్యం జమాల్ సాహెబ్ ( ఎన్ ఎం డి ఫరూక్ అబ్బ) వారసులైన నశ్య%శీ% దస్తగిరి సాహెబ్, నశ్యం ఇబ్రహీం సాహెబ్ ( ఎన్ఎండి ఫరూక్ తండ్రి), సారంబి ( ఎన్ఎండి ఫరూక్ మేనత్త), జైనబ్బి ( ఎన్ ఎండి ఫరూక్ మేనత్త) అనే నలుగురు భాగ పరిష్కార దస్తావేజును రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్నారు. కాలక్రమేణా అనుభవరీత్యా ఫరూక్ మేనత్త సారంబి వారసులు తమకు వచ్చిన ఆస్తిని అమ్మేశారు. సార%శీ%బి వారసులు తమకు వచ్చిన ఆస్తిని అమ్మే సమయంలో నశ్య%శీ% జమాల్ సాహెబ్ వారసులైన నలుగురికి సంక్రమించిన ఆస్తికి సంబంధించిన వివరాల్లో 1953 డాక్యుమెంట్ లోని హద్దులను పేర్కొనకుండా, సారంబి వారసులు హద్దులను మార్చి కొనుగోలుదారులకు రిజిస్టర్ చేయించారు. ఈ విషయంపై సారంబి వారసులు అమ్మిన ఆస్తికి సంబంధించిన రిజిస్టర్ డాక్యుమెంట్ నెంబర్లు 6591/2010,6592/2010 ను రద్దు చేయాల్సిందిగా నశ్య%శీ% ఇబ్రహీం వారసులు, జైనబ్బి వారసులు కోర్టు ను ఆశ్రయించారు. దీనిపై 2010లో రిజిస్టర్ అయిన భూమికి సంబంధించిన హద్దులు విషయంలో 1953 డాక్యుమెంట్ ప్రకారంగా లేవని,2010లోని డాక్యుమెంట్ను రద్దు చేయాలంటే 1953 లోని భాగ పరిష్కార డాక్యుమెంట్ ను సవరించాలని, ఆ పరిధి తమ కోర్టుకు లేదని పేర్కొంటూ, కోర్టు హద్దు మూడేళ్ల వరకే అని పేర్కొంటూ, 2010 రిజిస్టర్డ్ డాక్యుమెంట్ రద్దు పిటిషన్ ను కోర్టు రిజెక్ట్ చేయడం జరిగింది. ఈ విషయాన్ని సారాంబి వారసుల దగ్గర నుంచి కొనుగోలు వ్యవహారం నడిపిన వెంకటన్న, బాల నారాయణ తదితరులు సుప్రీంకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని పేర్కొంటుడడం ను నశ్యం కుటుంబ సభ్యులందరూ తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇదే స్థలం వివాదంలో సారంబి ( ఫరూక్ గారి మేనత్త ) వారసులపై, ఫరూక్ మరో మేనత్త జైనబ్బి వారసులు వేసిన కోర్టు కేసులు నంద్యాల మూడవ ఆదనపు జిల్లా కోర్టులో ఇంకా నడుస్తున్నాయి. కోర్టు కేసుల్లో పెండింగ్లో నడుస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా ఖాళీ స్థలానికి వేకెండ్ ల్యాండ్ టాక్స్ వేయడం కూడా చట్ట విరుద్ధం అయినందునే టాక్స్ విధించిన అధికారులపై మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని సస్పెండ్ చేశారు.

కబ్జాలకు పాల్పడాల్సిన కర్మ ఫరూక్ కు పట్టలేదు రోత రాతలు రాసిన విలేకరులారా మీ బులుగు లీడర్లను అడగండి ఫరూక్ వ్యక్తిత్వం ఏంటో చెబుతారు అన్నారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపాలనుకోవడం ఎంత మూర?త్వమో, మచ్చలేని నాయకుడిగా మైనార్టీల ఆశాజ్యోతి ఎన్ఎండి ఫరూక్ పై అవినీతిముద్ర వేయాలనుకోవడం అంతే మూర?త్వంఅన్నారు. నంద్యాల పట్టణ అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు విలువ చేసే స్థలాలు భూములను నశ్య%శీ% కుటుంబ సభ్యులు ఇచ్చిన విషయం ఆపత్రికకు ఆగిపించకపోవడం వెనుక మరో బలమైన కారణమే ఉందన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో కబ్జాదారులను దౌర్జన్యపరులను ఓటు అనే వజ్రాయుధంతో నంద్యాల ప్రజలు తరిమి తరిమి కొట్టారన్నారు. ఓటమిని జీర్ణించుకోలేక మచ్చలేని మైనార్టీ నాయకుడు ఫరూక్ కు న్యాయశాఖ మంత్రిగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా క్యాబినెట్లో చోటు దక్కడం చూసి భవిష్యత్తులో నంద్యాలలో తమకు రాజకీయ మనుగడ లేదని భావించిన బులుగు పార్టీ నాయకులు చెప్పినట్లుగా బులుగు పత్రికలో అసత్య రాతలుకు తెరలేపారన్నారు. నంద్యాల ప్రజలు ఫరూక్ పై ఆరోపణలను హర్షించరు. మరో ముఖ్య విషయం ఏమిటంటే సెటిల్మెంట్లు దందాలు కబ్జాలు ఆరోపణలను నాలుగు దశాబ్దాల రాజకీయ రంగంలో మచ్చలేని మహా నాయకుడుగా ఉన్న ఎన్ఎండి ఫరూక్ పై రుద్దాలనుకోవడం ఆకాశం పై ఉమ్మి వేయడమేనన్నారు.

# నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలి.

**-ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశంలో ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 27: నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం వద్దగల జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్ నందు నేర సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ప్రజల మధ్య ఉంటూ నేరాలు జరగకుండా చూస్తూ ఫ్రెండ్లి పోలిసింగ్ పై దృష్టి ఉంచాలని, విజిబుల్ పోలీసింగ్ పై పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టం లో వచ్చే ఫిర్యాదులు ప్రాధాన్యతనిస్తూ చట్టపరిధిలో నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణంలో మరియు గ్రామాలలో స్కూల్లో వద్ద, కళాశాల వద్ద, ముఖ్యమైన కూడళ్ళలో, పట్టణ శివారులలో నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలి. హైవే ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలి అందులో భాగంగా బ్లాక్ పాయింట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి, టర్నింగ్ లలో, ముఖ్యమైన ప్రాంతాలలో సిగ్నల్ బోర్డ్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. హైవే మొబైల్స్ సహకారంతో హైవేలలో జరిగే దొంగతనాలపై నిఘా ఉంచి నివారణ చర్యలు తీసుకోవాలి. పట్టణాలు గ్రామాలలో సమస్తత్మక ప్రాంతాలను గుర్తించి నేరాలు జరగకుండా కమ్యూనల్ గొడవలు జరగకుండా సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, భూతగాదాలు , గంజాయి, అక్రమ మద్యం మొదలగునవి జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. చట్ట ప్రకారం నివారణ చర్యలు తీసుకోని వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్లోని పరిశ్రమలలో జరిగే ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి నివారణ చర్యలతో పాటు ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు తీసుకోవలసిన భద్రత చర్యలపై యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలి.

త్వరలో జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు సంబంధించి కమిటీలు ఏర్పాటు చేసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. చాలాకాలం పెండింగ్లో ఉన్న పలు కేసులు వివరాలు తెలుసుకొని దర్యాప్తు తొందరగా ముగించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సంతోష్ ,ఆళ్లగడ్డ డి.ఎస్.పి రవికుమార్, సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను 24 గంటల లోపు పరిశీలించండి.

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



ఆంధ్రప్రగతి నంద్యాల, ఆగస్టు 27: "ప్రజా సమస్యల పరిష్కారం" లో బాగంగా స్వీకరించే ఫిర్యాదులను 24 గంటల లోపు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో నూతనంగా ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ కమాండ్ కంట్రోల్ కోఆర్డినేషన్ సెంటర్ ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను 24 గంటల లోపు పరిశీలించి నిర్ణీత కాలపరిమితి కంటే ముందుగానే పరిష్కరించాలని అధికారులను సూచించారు. సమస్య పరిష్కారం కాకముందే సంబంధిత అధికారి లాగిన్ నుండి పంపకూడదన్నారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు, మండలాధికారులు ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారంలో సాంకేతిక సమస్యలు ఎదురైతే కమాండ్ కంట్రోల్ రూమ్ కోఆర్డినేషన్ టీం నుండి పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.